సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం। 9। మార్చి। 2023



క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలి
విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని వీఎస్‌యూ వీసీ సుందరవల్లి పిలుపునిచ్చారు.
8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.56,950
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,087
3 శాతం జీఎస్టీతో	రూ.5,240
నవర (8 గ్రా)	రూ.41,920

గరిష్టం/కనిష్టం
33.5 /24.0

వాతావరణం
బుధవారం గాలిలో 50 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గురువారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి



వెంకటాచలం: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు బుధవారం మధ్యాహ్నం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్నారు. ఆయన జిల్లాలో నాలుగు రోజులు పర్యటించనున్నారు. ట్రస్ట్ వద్ద పలువురు వెంకయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫెన్సింగ్ జట్ల ఎంపిక



ఎంపికైన జట్టు సభ్యులతో అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం ఫెన్సింగ్ సీనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేశామని ఆ సంఘం అధ్యక్షుడు పాటూరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 10, 11 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రస్తుతం జరిగిన ఎంపికలకు రాష్ట్ర పరిశీలకులుగా రాజు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి గురవయ్య, రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధి శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చెక్కుల పంపిణీ



మహిళలకు చెక్కులను అందజేస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎనిమిది స్వయం సహాయక గ్రూపులకు మంజూరైన చేసిన రూ.1.10 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో బుధవారం పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చెక్కులను బ్యాంకు సీఈఓ డా.శంకర్‌బాబు, నాబార్డ్ డీడీఎం రవిసింగ్ చేతుల మీదుగా ఇచ్చారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు అన్నారు. అనంతరం బ్యాంకు వినియోగదారులు, వ్యాపారుల కోసం పేటీఎం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులకు పేటీఎం మెషీన్లను అందజేశారు. ఉత్తమ సేవలందించిన పొదుపు ఆర్పీ, స్వయం సహాయక గ్రూపు సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు జీఎం సరిత, డీజీఎం, ఏజీఎంలు పాల్గొన్నారు.

సోమశిలలో 59.058 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 59.058 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 2,100 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 570, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.872 మీటర్ల మట్టం నమోదైంది. సగటున 352 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

భద్రతా ప్రమాణాలపై శ్రద్ధ




ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

ముత్తుకూరు: కార్మికులు, ఉద్యోగులు భద్రతా ప్రమాణాలపై శ్రద్ధ చూపాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ సంజయ్ కొత్త అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోర్టులో కార్మికులు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతపై నిరంతరం దృష్టి కేంద్రీకరించాలన్నారు. పోర్టులో భద్రతకు, పర్యావరణానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సేఫ్టీ హెడ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ధరపై కోటి ఆశలు

పొగాకు వేలానికి రంగం సిద్ధమైంది. జిల్లాలోని నాలుగు వేలం కేంద్రాల్లో గురువారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. రీజియన్ పరిధిలో ఇప్పటికే ప్రారంభమైన వేలం కేంద్రాల పరిధిలో కేజీ పొగాకుకు అత్యధికంగా రూ.200 పలుకుతోంది. దీంతో ధరలపై ఇక్కడి రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో సరాసరి ధరలు అంతకు తగ్గకుండా ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది.



జిల్లాలో నేటి నుంచి వేలం ప్రారంభం
- అనుమతి కంటే అధికంగా సాగు
- ఆశలు రేకెత్తిస్తున్న మార్కెట్
- ఇప్పటికే ప్రారంభమైన చోట్ల కేజీకి రూ.200
- అదే ధర ఇవ్వాలని ఇక్కడి రైతుల డిమాండ్



కందుకూరు నియోజకవర్గంలో సాగు చేసిన పొగాకు పంట

వేలం కేంద్రం	సాగుకు అనుమతి	సాగు చేసింది	రైతుల సంఖ్య
కందుకూరు-1	6,134 హెక్టార్లు	7,174 హెక్టార్లు	3,348 మంది
కందుకూరు-2	5,500 హెక్టార్లు	6,300 హెక్టార్లు	2,894 మంది
కలిగిరి	3,632 హెక్టార్లు	3,371 హెక్టార్లు	1,451 మంది
డీసీపల్లి	4,969 హెక్టార్లు	4,660 హెక్టార్లు	2,115 మంది



కందుకూరు: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో మొత్తం 11 వేలం కేంద్రాలుండగా వీటిలో నాలుగు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. అవి కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, మర్రిపాడు మండలంలోని డీసీపల్లి. ఈ సీజన్‌కు సంబంధించి వాటిల్లో గురువారం నుంచి వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. మాండూస్ తుపాన్ పొగాకు రైతులను తీవ్రంగా దెబ్బకొట్టింది. తోటలు నష్టపోవడంతో తిరిగి మొక్కలు వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో గతంతో పోల్చుకుంటే సాగు ఖర్చు కొంతమేర పెరిగాయి.

పెరిగిన సాగు
ఈ ఏడాది పొగాకు సాగు భారీగా పెరిగింది. మార్కెట్ ఆశాజనకంగా ఉండటంతో రైతులు బోర్డు ఇచ్చిన అనుమతికి మించి అధికంగా సాగు చేశారు.

అప్పుడే బయటపడతాం
ఈ ఏడాది నాణ్యమైన పొగాకు (గ్రేడ్-1) ఆశించిన విధంగానే ఉండటంతో ధరలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఒంగోలు, పొదిలి, కొండపి వంటి వేలం కేంద్రాల్లో వేలం ప్రక్రియ ప్రారంభమైంది. అక్కడ కేజీ పొగాకు ధర అత్యధికంగా రూ.200 వరకు పలుకుతోంది. గురువారం కూడా ఇక్కడ ఇదే ధర నుంచి వేలం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. ఆ ధరే ఉండొచ్చని బోర్డు అధికారులు కూడా చెబుతున్నారు. కాకపోతే సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో అన్ని గ్రేడ్లు కలిపి సరాసరి ధర రూ.200 వరకు ఇవ్వాలనే డిమాండ్ రైతుల నుంచి వినిపిస్తోంది. అప్పుడే నష్టాల్లేకుండా గట్టునపడతామంటున్నారు. అయితే ఇప్పటి వరకు జరిగిన వేలంలో సరాసరి ధర రూ.178గా ఉంది. మొదట్లోనే సరాసరి ధర ఇలా ఉంటే వేలం జరిగే కొద్దీ మరింత తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం క్వింటాలు పొగాకుకు రూ.20 వేల వరకు ఇస్తున్నారని, దీనిని రూ.22 వేలకు పెంచాలని కోరుతున్నారు. గతేడాది వేలంలో డిమాండ్ బాగుండటంతో హైగ్రేడ్ నుంచి లోగ్రేడ్ పొగాకు వరకు దాదాపు ఒకే రకం ధర వచ్చిందని, కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎలాంటి జాప్యం లేకుండా వేలం ప్రక్రియను వేగంగా ముగించాలని రైతులు కోరుతున్నారు.

కందుకూరు-1 వేలం కేంద్రంలో 11 మిలియన్ కేజీలు, రెండులో 9.5 మిలియన్ కేజీలు, కలిగిరిలో 4.8 మిలియన్ కేజీలు, డీసీపల్లిలో ఏడు మిలియన్ కేజీల వరకు ఉత్పత్తి రావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా రీజియన్ పరిధిలో 87 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలకు అనుమతి ఉంటే 99 మిలియన్ కేజీల వరకు ఉత్పత్తి రావచ్చని బోర్డు అధికారుల అంచనాగా ఉంది.

వేలం ప్రారంభిస్తున్నాం



గురువారం నుంచి జిల్లాలోని నాలుగు వేలం కేంద్రాల్లో పొగాకు వేలం అధికారికంగా ప్రారంభమవుతుంది. కందుకూరు-2 వేలం కేంద్రంలో 27 బేళ్లు వేలానికి ఉంచుతున్నారు. ప్రస్తుతం పొగాకు కేజీ రూ.200 వరకు పలుకుతోంది. ఇదే ప్రారంభ ధరగా ఇక్కడ కూడా ఉండొచ్చు. దీనిపై రైతులు కొంత వరకు సంతృప్తిగానే ఉన్నారని భావిస్తున్నాం. డిమాండ్‌ని బట్టి వేలంలో ధరలు ఉంటాయి.
– రాజగోపాల్‌రెడ్డి, రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి

సరాసరి ధర తగ్గకుండా చూడాలి



ఈ ఏడాది పొగాకులో సాగు ఖర్చులు బాగా పెరిగాయి. దీనికి అనుగుణంగా ధరలు పెంచాల్సిన అవసరం ఉంది. క్వింటా పొగాకు రూ.22 వేల వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే కిలో సరాసరి ధర కూడా రూ.200 తగ్గకుండా ఉంటేనే రైతులకు లాభాలు వస్తాయి. నష్టాలు లేకుండా బయటపడాలంటే ధరలు పెంచాలి.
– తాటికొండ రమణయ్య, దక్షిణ ప్రాంత తేలిక నేలల రైతు సంఘం నాయకుడు



క్యూరింగ్ చేసిన పొగాకు

వారు బాగుంటేనే సమాజం బాగు

- మహిళల సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట
- ఎస్పీ సీహెచ్ విజయారావు



వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ, మహిళా అధికారులు తదితరులు

నెల్లూరు(క్రైమ్): మహిళలు బాగుంటేనే సమాజం అన్నివిధాలుగా బాగుంటుందని ఎస్పీ సీహెచ్ విజయారావు అన్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని మహిళా పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అనిర్వచనీయమన్నారు. మహిళా ఉద్యోగి కష్టాలు వెలకట్టలేనివన్నారు. ఇంట్లోనూ, విధి నిర్వహణలోనూ సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. జీవన విధానాన్ని మార్చుకుంటూ తమను తాము స్వయంగా నిర్మించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రత, రక్షణలో మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు భేష్ అని కొనియాడారు. విధినిర్వహణతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వహించగలరన్నారు. మహిళల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అందులో భాగంగా దిశ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేసి వారి సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టిందన్నారు. ఆపదలో ఉన్న మహిళల రక్షణకు దిశ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా మహిళలపై జరిగే దాడులు, అఘాయిత్యాలపై త్వరితగతిన విచారణ జరిపి నిందితులకు శిక్షలు పడుతున్నాయన్నారు.

ఇంటికి వెలుగు
ఏఎస్పీ డి.హిమవతి మాట్లాడుతూ ఇంటికి ఇల్లాలే వెలుగన్నారు. ఆమె మొదటి గురువన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో ఆ చట్టాలు, దిశ యాప్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. మహిళలు తమలోని సహజమైన సృజనాత్మకతను సద్వినియోగం చేసుకోవాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేశారు. తొలుత ప్రముఖ న్యూరాలజీ, ఆంకాలజీ వైద్యనిపుణులచే వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులు, నరాల వ్యాధులపై అవగాహన కల్పించారు.

మహిళలు బాగా చదువుకోవాలి



టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న కలెక్టర్ సతీమణి కిరణ్మయి, మహిళా ఉద్యోగులు

నెల్లూరు(అర్బన్): మహిళలు ఉన్నత విద్యనభ్యసించి సమాజాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు సతీమణి కిరణ్మయి చక్రధర్ జ్యోతి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ఎన్జీఓ భవన్‌లో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. వీటిని కిరణ్మయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారిని మరింతగా ప్రోత్సహించాలన్నారు. కుటుంబ, ఉద్యోగ పరంగా ఎన్నో ఒత్తిళ్ల మధ్య పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. ఈ సందర్భంగా రంగవల్లులు, వ్యాసరచన వక్తృత్వ, పాటలు, నృత్యం, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు జరిగాయి. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి వైద్యశాఖకు చెందిన ఆశావర్కర్ వనజ, ద్వితీయ బహుమతి జెడ్పీకి చెందిన ప్రసన్న, తృతీయ బహుమతి ఇరిగేషన్ శాఖకు చెందిన శ్రీజలు అందుకున్నారు. వ్యాసరచనలో మొదటి బహుమతి వైద్యశాఖకు చెందిన అనీల, ద్వితీయ బహుమతి జెడ్పీకి చెందిన హైమావతి, తృతీయ బహుమతి వైద్యశాఖకు చెందిన గీతావాణి గెలుచుకున్నారు. ఆ అసోసియేషన్ మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ చిన్నమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, డీఈఓ గంగాభవాని, ఐటీడీఏ పీడీ మందా రాణి, డ్వామా ఏపీఓ వసుంధర, రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్ స్వర్ణలత, కన్వీనర్ శారద, ఎన్జీఓ అధ్యక్ష కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, వెంకటస్వామి, ఆంజనేయవర్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 15 నుంచి పరీక్షలు ప్రారంభం
- జిల్లాకు చేరుకున్న ఓఎంఆర్ షీట్లు, సామగ్రి
- జంబ్లింగ్ విధానంలో నిర్వహణ
- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు



నెల్లూరులోని కేపీసీ జూనియర్ కాలేజీ

పరీక్ష కేంద్రాలు : 95	విద్యార్థుల సంఖ్య : 55,909 మంది
ఇన్విజిలేటర్లు : 1,597 మంది	

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇవి ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయి. ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్ జిల్లాకు చేరుకుంది. ప్రశ్నపత్రాలు కూడా నేడో.. రేపో రానున్నాయి. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరుగుతాయి. మొత్తం 95 సెంటర్లను ఏర్పాటు చేశారు. 27,605 మంది ప్రథమ సంవత్సరం, 28,304 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. 1,597 మంది ఇన్విజిలేటర్లు, 95 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 95 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ఇంకా 22 కస్టోడియన్లు, 19 మంది స్పెషల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారు.

పక్కాగా నిర్వహించేందుకు..
పరీక్షల్లో అవకతవకలకు తావులేకుండా పక్కాగా నిర్వహించేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్, పది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎగ్జామ్స్ జరుగుతాయి. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. తద్వారా రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారులు కూడా పర్యవేక్షించనున్నారు. కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తారు. సమీపంలో ఉండే జెరాక్స్ కేంద్రాలను మూసివేయిస్తారు. కాగా జిల్లాలో ఐదు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. వీటిల్లో పరీక్షల నిర్వహణపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ నిబంధనను అమలు చేస్తున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. విద్యార్థులు సెల్‌ఫోన్, కాలిక్యులేటర్, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు. ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్‌ను కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ వద్ద ఉంచి వెళ్లాలని ఆదేశించారు.

కంట్రోలు రూం ఏర్పాటు
ఫీజులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి ఆయా కళాశాలల యాజమాన్యం హాల్‌టికెట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీని విషయంలో సమస్యలుంటే ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా హాల్‌టికెట్లను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దానిపై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకం లేకున్నా పరీక్షకు అనుమతించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇంకా పరీక్ష కేంద్రాల్లో ఇబ్బందులు తెలుసుకునేందుకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు కంట్రోలు రూం ఏర్పాటు చేశారు. ఏమైనా సమస్యలుంటే విద్యార్థులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

నేడు సమావేశం
పరీక్షలపై గురువారం నెల్లూరులోని రావూస్ డిగ్రీ కళాశాలలో సమావేశం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు హాజరుకావాలన్నారు.

హాల్‌టికెట్ల సమస్యపై..
ఫోన్ చేయాల్సిన నంబర్ :
(1800 425 7635 టోల్ ఫ్రీ)
కేంద్రాల్లో ఇబ్బందులపై ఫిర్యాదు
చేయాల్సిన నంబర్ : 0861–2320312

ఏర్పాట్లు పూర్తి చేశాం
ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశాం. మంగళవారం పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించాం. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా అమర్చాలి. కేంద్రాలకు సబంధించిన మెటీరియల్ జిల్లాకు వచ్చింది.
– వరప్రసాద్‌రావు, ఆర్‌ఐఓ

రైలు ఎక్కుతుండగా..

- జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్): కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో ప్రమాదశాత్తు జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం రాంచి జిల్లా ఓరం నారావ్ గ్రామానికి చెందిన ఓరం సందీప్‌కు భార్య, కుమారుడున్నారు. అతను బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసి వచ్చిన సంపాదనను ఊర్లో ఉన్న భార్య, కుమారుడికి పంపుతుంటాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లాడు. ఈనెల 7వ తేదీన పనుల నిమిత్తం హతియా–యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరుకు బయలుదేరాడు. బుధవారం రాత్రి రైలు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై ఆగింది. సందీప్ అవతలి వైపు దిగాడు. రైలు కదలడంతో ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తలకు తీవ్రగాయమైంది. గస్తీ విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ కిశోర్ గమనించి క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. సందీప్ పరిస్థితి విషమంగా ఉంది.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



స్నపన తిరుమంజనంలో భాగంగా ప్రసన్నునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కొండ దిగువన పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

- ముగిసిన ప్రసన్నుని బ్రహ్మోత్సవాలు

బిట్రగుంట: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం స్నపన తిరుమంజనం, చక్రస్నానం శాస్త్రోక్తంగా, కనులపండువగా సాగాయి. తిరుమంజనంలో భాగంగా కళ్యాణ మండపం వేదికపై సుదర్శన చక్రంతో కొలువుదీరిన స్వామి, ఉభయ దేవేరులకు వేదపండితులు, ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. ఆఖరున సహస్రధారతో శుద్ధి చేసి కొండ దిగువన ఉన్న కోనేరులో చక్రధారికి చక్రస్నానం చేయించారు. దీనికి కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి – కల్పన, పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి – సుగుణ, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి – నీరజ, ఈతముక్కల బాలమురళి – రాధ, ఈతముక్కల ఆదిశేషారెడ్డి, సుజాత, కాకు మధుసూదన్‌రెడ్డి, అరుణమ్మ, కర్తం సురేందర్‌రెడ్డి – వాణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవంగా పుష్పయాగం

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన పుష్పయాగం భక్తులకు దివ్యానుభూతిని కలిగించింది. ఆలయ ప్రధానార్చకులు వేదగిరి కళ్యాణ చక్రవర్తి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉభయకర్తలు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పదుల రకాల పుష్పాలతో యాగాన్ని నిర్వహించారు.

దారి తప్పుతున్నారు

నెల్లూరు నగరంలోని ఉడ్‌హౌస్ సంఘంలో ఓ యువకుడిని కొందరు యువకులు దారుణంగా హత్యచేశారు. వారిలో ఒకరు రౌడీషీటర్ కాగా మిగిలిన వారందరూ పాతనేరస్తులే. అందరూ 25 ఏళ్లలోపు వయసు వారే.

నెల్లూరు నగరంలోని స్వర్ణాలచెరువు, పొగతోట, తిక్కనపార్కు ప్రాంతాల్లో దోపిడీకి యత్నిస్తున్న సుమారు 20 మందికిపైగా రౌడీషీటర్లను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. వారిలో కూడా అత్యధికులు యువకులే కావడం గమనార్హం.

- చిన్న వయసులోనే చెడు అలవాట్లు
- కుటుంబంలో నిరాదరణ
- చెడు వ్యసనాల కోసం చోరీలు, హత్యలు
- రౌడీషీట్లు తెరుస్తున్నా లెక్కచేయని వైనం



భావిభారత పౌరులుగా రాణించాల్సిన యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి నేరాలకు దగ్గరవుతున్నారు. జల్సాలకు కోసం అనేక మంది చోరీలకు పాల్పడుతున్నారు. చిన్నచిన్న కారణాలతో క్షణికావేశాలతో హత్యలకు పాల్పడుతుండడం కలవరపెడుతోంది. కొందరు యువతలో పెరుగుతున్న నేరప్రవృత్తిపై ప్రత్యేక కథనం.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : జిల్లాలో ఇటీవల జరుగుతున్న నేరాల్లో అనేక మంది యువకులే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. నెల్లూరు నగరంలో జరిగిన హత్యకేసు నిందితుల్లో నలుగురు రౌడీషీటర్లు 25 ఏళ్ల లోపు వారే. పీడీయాక్ట్ ప్రయోగించబడి జైలులో ఉన్న 11 మందిలో ఆరుగురు యువకులు. ఇలా అనేక ఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి.

నేటి యుగంలో..

కార్పొరేట్ యుగంలో మద్యం తాగడం కామన్‌గా మారింది. గతంలో ఎవరో దారి తప్పిన కొందరు యువకులు మాత్రమే మద్యం తాగేవారు. ప్రతిసారి సరదాలకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? దీంతో ఇళ్లలో పెద్ద వాళ్లను ఏమార్చి చిల్లర దొంగతనాలు చేయడం, అబద్ధాలు చెప్పి ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకోవడం వంటివి చేస్తున్నారు. అవసరాల కోసం కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. ఒక్కసారి నేరానికి పాల్పడితే అదే అలవాటుగా మారుతోంది.

చెడు స్నేహం

పలు కేసుల్లోని నిందితులను పోలీసులు విచారించగా స్నేహితుల వల్లనే నేరాలు చేసినట్లు వెల్లడించారు. ఈజీ మనీకి అలవాటుపడుతున్న యువత గొలుసు దొంగతనాలు, దోపిడీలు, హత్యలు తదితరాలు చేసేందుకు వారి స్నేహాలే కారణమని తెలుస్తోంది. కేఫ్‌లు, బార్‌లలో కొందరు నేరస్తులతో యువతకు పరిచయం ఏర్పడుతోంది. అనంతరం వారు స్నేహితులుగా మారుతున్నారు. అక్కడి నుంచే నేర సంస్కృతికి బీజం పడుతోంది.

పర్యవేక్షణ లేక

ఇల్లు విడిచి బయటకు వెళ్లిన కుర్రాడు ఏం చేస్తున్నాడో.. అర్ధరాత్రులు ఎందుకు వస్తున్నాడు? స్నేహితులు ఎవరు.. ఇలా అధిక శాతం మంది తల్లిదండ్రులు పిల్లల గురించి ఆలోచించడం తగ్గించేశారు. తల్లిదండ్రులు పిల్లలపై పెంచుకున్న నమ్మకం కూడా వారు చేసిన తప్పులను పట్టుకోలేకపోతున్నారు. ఇలా పర్యవేక్షణ లేకపోవడంతోనే వారు చెడు మార్గం పడుతున్నారు.



ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన దోపిడీ దొంగలు (ఫైల్)

వ్యక్తిత్వ లోపాలే కారణం



పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం సరిగ్గా ఉండకపోవడం నేరప్రవృత్తికి దారి తీస్తోంది. తల్లిదండ్రుల ఆదరణ, సంరక్షణ, పర్యవేక్షణ లేకపోవడంతో పాటు మానసిక రుగ్మతలు కూడా ప్రధాన కారణం. పిల్లల్లో వస్తున్న మార్పులను ముందుగా గర్తించాలి, తగిన చర్యలు తీసుకోవాలి. కుటుంబపరంగా, సామాజిక పరంగా, స్కూల్ పరంగా మల్టీసిస్టమ్యాటిక్ థెరపి చేయాలి. మానసిక రుగ్మతలు ఉంటే ఔషధాలు వాడటం వల్ల ప్రయోజనం ఉంటుంది.

– రాధాకృష్ణరాజు, మానసిక వైద్య నిపుణుడు, నెల్లూరు జీజీహెచ్

నిరంతర నిఘా ఉంచాలి



తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతర నిఘా ఉంచాలి. వారు ఏం చేస్తున్నారు? ఎటు వెళ్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారు.. అనే విషయాలపై దృష్టి సారించాలి. మంచి, చెడుల గురించి అవగాహన కల్పించాలి. నేరాలకు పాల్పడితే జరిగే అనర్థాలను వివరించి వాటికి దూరంగా ఉండేలా చూడాలి. యువత వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి. ఒక్కసారి దోషులుగా మారి జైలు శిక్ష పడితే జీవితాంతం బాధపడక తప్పదు.

– డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

యువకుడి కిడ్నాప్.. ఆపై హత్యాయత్నం

- పోలీసులు పట్టుకునే లోపు నిందితులు పరార్

నెల్లూరు(క్రైమ్) : ఓ యువకుడిపై కొందరు దాడిచేశారు. అనంతరం అతన్ని కిడ్నాప్ చేసి ఆపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు సకాలంలో వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా నిందితులు పరారయ్యారు. క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించి బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉదయగిరికి చెందిన షేక్.వసీమ్ అక్రమ్ ముత్తుకూరు మండలం జంగాలకండ్రిగలోని జగన్స్ ఫార్మసీ కళాశాలలో ఫైనలియర్ చదువుతూ హరనాథపురంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. అదే కళాశాలలో చదువుతున్న ప్రభాస్, సంజయ్ అతనికి స్నేహితులు. నిత్యం వారితోనే ఉండేవారు. ప్రభాస్, సంజయ్‌లకు సహచర విద్యార్థులతో పాటు పలువురితో పాతగొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఖాజా, వినయ్, మదన్ మైఖేల్, రాకేష్ మరికొందరు బుధవారం వసీమ్ అక్రమ్ ఉంటున్న హాస్టల్‌కు వెళ్లి అతనిపై మారణాయుధాలతో దాడిచేశారు. బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్తుండటాన్ని స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం అందించారు. దుండగులు అతన్ని జంగాలకండ్రిక వద్దకు తీసుకెళ్లి మరోసారి విచక్షణారహితంగా దాడిచేసి తిరిగి నెల్లూరుకు తీసుకుని బయలుదేరారు. అప్రమత్తమైన బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ నిందితులు వసీమ్ అక్రమ్‌ను ముత్తుకూరు వైపు తీసుకెళ్లారనే పక్కా సమాచారంతో రహదారి వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. ధనలక్ష్మీపురం సమీపంలోని ఓ కల్యాణ మండపం వద్ద దుండగులు అతన్ని కొట్టేందుకు ప్రయత్నిస్తుండటాన్ని ఇన్‌స్పెక్టర్ గమనించి నిందితులను పట్టుకునే ప్రయత్నం చేయగా వారు వసీమ్ అక్రమ్‌ను అక్కడే వదిలి బైక్‌లపై పరారయ్యారు. ఇన్‌స్పెక్టర్ వారిని వెంబడించి పట్టుకునేందుకు విఫలయత్నం చేశారు. కొందరు బైక్‌ల వేగం పెంచి పరారవగా, కొందరు బైక్‌లను వదిలి పరుగులు తీశారు. దీంతో పోలీసులు బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. దాడిచేసిన వారిలో కొందరు ఫార్మసీ విద్యార్థులుండగా మరికొందరు బయటివారని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది. తమకు వ్యతిరేకులతో సన్నిహితంగా ఉన్నాడన్న అక్కసుతోనే నిందితులు వసీమ్‌పై దాడిచేసినట్లు సమాచారం.

క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలి

- వీఎస్‌యూ వీసీ సుందరవల్లి



క్రీడా జ్యోతిని వెలిగించిన వీసీ సుందరవల్లి, అధ్యాపకులు

వెంకటాచలం : విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని విక్రమసింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధవారం ఉదయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. వైస్ చాన్సలర్ జీఎం సుందవల్లి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. వీఎస్‌యూ ఆధ్వర్యంలో క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నామని, తొమ్మిదెకరాల్లో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయించి, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కాగా పోటీల్లో పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్స్‌గా కెమిస్ట్రీ విద్యార్థులు, మహిళా విభాగంలో ఓవరాల్ చాంపియన్స్‌గా మేనేజ్‌మెంట్ విద్యార్థులు నిలిచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌బాబు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ కె.సునీత సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతంగా చదవాలి.. గొప్పగా రాణించాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న వీసీ, అధ్యాపకులు



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మహిళా ప్రముఖులకు సన్మానం

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి

వెంకటాచలం : విద్యార్థినులు ఉన్నతంగా చదివి నచ్చిన రంగాల్లో గొప్పగా రాణించాలని విక్రమసింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకుని తమ ప్రతిభను చాటాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహిళలు వివిధ రంగాల్లో రాణించేందుకు చదువు చాలా అవసరమని తెలియజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఖచ్చితంగా ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ వై.అమృతవల్లి, సేవాప్రియ, జ్యోత్స్న, పద్మావతి, వీఎస్‌యూ మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ విజయ, మధుమతి, సాయి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..

మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రముఖులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, ప్రాచీన భాషల శాఖాధిపతి శివరామకృష్ణ, ప్రముఖ రచయిత్రి, అధ్యాపకురాలు డాక్టర్ పాతూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

- మరొకరికి గాయాలు



అజీజ్‌బాషా మృతదేహం

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని జెండావీధికి చెందిన సులేమాన్ కుమారుడు అజీజ్‌బాషా(19) మోటారు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడు ఎస్‌కే ఆసీమ్‌తో కలిసి కసుమూరు దర్గాకు బైక్‌పై మంగళవారం రాత్రి వచ్చారు. దర్శనం చేసుకుని నెల్లూరుకు బయలుదేరారు. కసుమూరు గ్రామం వద్ద ఆసీమ్ బైక్‌ను అతివేగంగా నడపడంతో అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అజీజ్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆసీమ్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి సులేమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మకంగా ఉంటూ దోపిడీ

- వృద్ధురాలిని బెదిరించి ఆభరణాలు దోచేసిన పనిమనిషి
- కేసు నమోదు చేసిన పోలీసులు
- అదుపులో నిందితురాలు?

నెల్లూరు(క్రైమ్) : ఓ పనిమనిషి నమ్మక ద్రోహానికి ఒడిగట్టింది. తాను పనిచేస్తున్న ఇంట్లోనే తొమ్మిది పదుల వయసున్న యజమానిని చంపుతానని బెదిరించింది. ఆమె ఒంటిపైనున్న సుమారు 98 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లింది. ఈ ఘటన బుధవారం ప్రకాష్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ప్రకాష్‌నగర్‌లో ఎన్.సీతాశ్యామ్‌ప్రసాద్ తన భార్య గాయత్రి, తల్లి రాజారత్నంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయనకు ఓ కుమార్తె ఉండగా ఆమెకు వివాహమై హైదరాబాద్‌లో ఉంటోంది. పి.లక్ష్మి అనే మహిళ ఏడేళ్లుగా సీతాశ్యామ్‌ప్రసాద్ ఇంట్లో పనిమనిషిగా చేస్తూ అదే ఇంటి వెనుక పోర్షన్‌లో భర్తతో కలిసి అద్దెకు ఉంటోంది. యజమానులకు లక్ష్మి ఎంతో నమ్మకంగా ఉండేది. ఈ నేపథ్యంలో 7వ తేదీ మంగళవారం ఉదయం 10.50 గంటల సమయంలో సీతాశ్యామ్‌ప్రసాద్ తన భార్యతో కలిసి ఇంటికి సమీపంలోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లా రు. తల్లి వృద్ధురాలు కావడంతో ఆమెను ఇంట్లోనే ఉంచి వెళ్లారు.

చంపుతామని బెదిరించి..

ఆర్థిక ఇబ్బందులో? మరే కారణమో తెలియదుకాని లక్ష్మి ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకుంది. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి ఒంటిపై పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు ఉండటంతో వాటిని కాజేస్తే తన అవసరాలు తీరుతాయని భావించింది. అదను కోసం వేచిచూడసాగింది. యజమానులు మంగళవారం బయటకు వెళ్లడాన్ని గమనించింది. వెంటనే ఇంట్లోకి వెళ్లిన లక్ష్మి అరిస్తే చంపుతానని వృద్ధురాలిని బెదిరించింది. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న రూ.4.90 లక్షల విలువచేసే 98 గ్రాముల బంగారు గాజులు, ఉంగరాలు, గొలుసులను దోచుకుని అక్కడి నుంచి పరారైంది. ఊహించని పరిణామంతో వృద్ధురాలు బెదిరిపోయింది. ఏడుస్తూ ఉండిపోయింది. 11.30 గంటలకు గుడి నుంచి ఇంటికి వచ్చిన కుమారుడు, కోడలు ఏం జరిగిందని ఆరాతీయగా పనిమనిషి చేసిన ఘోరాన్ని వివరించింది. దీంతో సీతాశ్యామ్‌ప్రసాద్ దంపతులు తన అల్లుడికి జరిగిన విషయాన్ని చెప్పారు. కుమార్తె, అల్లుడు బుధవారం హైదరాబాద్ నుంచి నెల్లూరుకు వచ్చారు. ఈ మేరకు గాయత్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరారీలో ఉన్న లక్ష్మి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గంటల వ్యవధిలోనే ఆమెను అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 95
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 172
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 192
లేయర్ చికెన్	: 128



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.75
పండ్లు	: రూ.45



అన్ని రంగాల్లో మహిళలు ముందంజ

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



వైఎస్సార్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

నెల్లూరు(సెంట్రల్) : ప్రస్తుత సమాజంలో అన్నిరంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని ఉత్తర భారతదేశ తిరుమల తిరుపతి దేవస్థానాల స్థానిక సలహాకమిటీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అన్నిరంగాల్లో మహిళలు అంచెలంచెలుగా ఎదుగుతున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం మహిళలకు అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర మంత్రివర్గంలో కూడా మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రధానంగా పేద ప్రజలకు ఇచ్చే ఇంటి పట్టాలను కూడా మహిళ పేరు మీదనే ఇస్తున్నారని ప్రశంసించారు. మొయిళ్ల గౌరి మాట్లాడుతూ ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం అనే మాటల్ని నిజం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నిరంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, మమతారెడ్డి, విజయలక్ష్మి, దాసరి అమృత, పర్వీన్‌ఆసిఫా, పద్మజారెడ్డి, ప్రసన్న, స్వర్ణలత, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.